RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 239 | పేజీలు : 08 | మంగళవారం | 08-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర



- తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర: సీఎం రేవంత్ రెడ్డి
- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు.రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

మిగతా 2 లో



# వదిలిపెట్టం

- మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు
- బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య
- శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ

మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ శాసనసభ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్

## తాతా మధుపై చర్యలు తీసుకోవాల్సిందే :మంత్రి శ్రీధర్ బాబు

మిగతా 2 లో

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్

తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం

ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం

స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య

బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.



# అసెంబ్లీలో రచ్చ..

బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం

- 22-ఏపై చర్చకు బీజేపీప సభ్యుల పట్టు
- భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు
- బీఆర్ఎస్ తో బీజేపీ కుమ్మక్కయిందన్న కోమటిరెడ్డి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభలో బీజేపీ సభ్యుల గందరగోళంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే, బీజేపీ ఎమ్మెల్యేలు 22-ఏ నిషిద్ధ భూముల అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబడుతూ ప్లకార్డులతో సభాప్రాంగణంలోకి దూసుకెళ్లారు. స్పీకర్ కల్పించుకుని... బీఏసీ సమావేశంలో చర్చించి 22-ఏపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు తగ్గలేదు. భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు.మరోవైపు,

మిగతా 2 లో

# నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది

ఎమ్మెల్సీ తాతా మధు

- నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను దూషించలేదు..నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది : ఎమ్మెల్సీ తాతా మధు
- అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు
- స్పీకర్ స్థానంపై తనకు అపారమైన గౌరవం ఉందని వ్యాఖ్య
- తన గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానన్న మధు

మిగతా 2 లో



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

అసెంబ్లీ స్పీకర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. మధు చేసిన వ్యాఖ్యలు సరికాదంటూ అధికార పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో తాతా



మిగతా 2 లో

# పొంగులేటిని వెంటనే తొలగించాలి

- వేల కోట్లు కొల్లగొడుతున్న పొంగులేటిని వెంటనే తొలగించాలి
- గన్‌పార్క్ వద్ద బీజేపీ తీవ్ర నిరసన
- 22ఏ పేరుతో సాగుతున్న భూదందా వెనుక పొంగులేటి ఉన్నారన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- భూ కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్
- రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలు కావడం లేదని మండిపాటు

# మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం..

డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

- డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు
- అసెంబ్లీ సాక్షిగా పాత ఫైళ్లను,కమిషన్ల వివరాలను ప్రస్తావించిన సీఎం
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మిగతా 2 లో

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష

## తాతా మధును బర్తరఫ్ చేయాలి

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

మిగతా 2 లో

స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు తాతా మధుపై ఆరోపణలు

# గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

మిగతా 2 లో



- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ

# ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు..

పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

- అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు
- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన

మిగతా 2 లో



# జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు

- ఇది నాకో,సునీతమ్మకో జరిగిన అవమానం కాదు: సబితా ఇంద్రారెడ్డి
- మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారన్న సబిత
- కేటీఆర్ అడ్డుకోకపోయి ఉంటే అక్కడే పడేసి తొక్కేసే వారని ఆవేదన
- హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు

మిగతా 2 లో



# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

మొదటి పేజీరువాయి

కొడంగల్‌లో 81 వేల ఓట్లు

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు.బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

సారంపల్లి సేవలు చిరస్మరణీయం

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు.కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

# నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది

మొదటి పేజీరువాయి

మధు మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం, చేతకానితనంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పుడు ఆరోపణలకు తెరతీసిందని తాతా మధు విమర్శించారు. "పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అధికార ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ ఆరోపణలు, సవాల్‌లతో అసెంబ్లీ ప్రాంగణంలో పొలిటికల్ హీట్ మరింత రగిలింది.

# గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

మొదటి పేజీరువాయి

సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు.కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు.పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

# ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు..

మొదటి పేజీరువాయి

తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# వదిలిపెట్టం

మొదటి పేజీరువాయి

సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు."కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు.మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

మొదటి పేజీరువాయి

తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు.బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు.తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు.మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో రచ్చ..

మొదటి పేజీరువాయి

బీజేపీ సభ్యుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సభలో ఏ అంశంపైనైనా సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే కావాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. లక్ష కోట్ల మేర భారీ అవినీతి జరిగిందని, దానిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏడాది క్రితం లేఖ రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్‌తో లోపాయికారీగా కుమ్మక్కై విచారణ జరగకుండా బీజేపీ అడ్డుపడుతోందని సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం అవినీతి బయటకు రాకుండా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే అడ్డుపడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు.మరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభకు బీజేపీ సభ్యులు సహకరించాలని విన్నవించారు. ప్రొసీజర్ ప్రకారం సభ నడవాలని అన్నారు. 22-ఏపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

# జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు

మొదటి పేజీరువాయి

అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు."సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు.మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం..

మొదటి పేజీరువాయి

డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమైన, కించపరిచే వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభలో స్పష్టం చేశారు. డీఎంకేకు ఓటు వేయని ప్రజలను ఆ పార్టీ నేతలు విమర్శించడంపై ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే డీఎంకే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు.అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ, డీఎంకే బండారం మొత్తం అధికారిక రికార్డుల్లో, అసెంబ్లీ లైబ్రరీలో అందుబాటులో ఉందని విజయ్ అన్నారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను ఆయన ఉటంకించారు. వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కమీషన్లు డిమాండ్ చేశారని, ఒక నిర్దిష్ట కంపెనీకి అనుకూలంగా వ్యవహరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అంతేగాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలను కూడా విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ ఫండ్ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారని, కొన్ని లావాదేవీలలో 7.5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ లావాదేవీలలో మాజీ మంత్రికి సంబంధించిన అధికారులు, వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నారని విజయ్ తెలిపారు. ఈడీ ఆరోపణలకు సంబంధించి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఇవి కేవలం ఏజెన్సీ చేసిన ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో ఇంకా రుజువు కాలేదని గమనించాలి.డీఎంకే అవినీతికి సంబంధించిన రికార్డులు చాలా ఉన్నాయని, అవన్నీ చదవాలంటే దాదాపు రెండు రోజులు పడుతుందని, అందుకే సభలో కేవలం సారాంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తున్నానని విజయ్ చెప్పారు. ఇప్పటికే బహిరంగ రికార్డుల్లో ఉన్న ఆధారాల కోసం డిమాండ్ చేయడం మాని, తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డీఎంకేకు సవాల్ విసిరారు.తాను పదవి కోసమో, అధికారం కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని స్పష్టం చేశారు. సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు వంటి మహనీయుల వారసత్వాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై ప్రజల అభిమానమే అంతిమంగా గెలుస్తుందని విజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# పొంగులేటిని వెంటనే తొలగించాలి

మొదటి పేజీరువాయి

రాష్ట్రంలో సెక్షన్ 22ఏ నిషిద్ధ భూముల పేరుతో సాగుతున్న భారీ భూదందా వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హస్తముందని, ఈ అక్రమాల ద్వారా ఆయన వేల కోట్ల రూపాయలు వెనకేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి... రాష్ట్రంలో అసలు రూల్ ఆఫ్ లా అనేది అమలు కావడం లేదని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషిద్ధ భూముల జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల న్యాయమైన భూములను నిలిపివేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆ భూములకు రక్షణ కల్పించి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని కోరారు. 22ఏ భూకుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయడంతో పాటు ఆయన రాజీనామాను ఆమోదించాలని పట్టుబట్టారు.రాబోయే శాసనసభ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు, పోలీస్ నోటిఫికేషన్లు, ధరణి, భూభారతి అక్రమాలపై అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

# నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది

మొదటి పేజీరువాయి

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది.మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు

# తాతా మధుపై చర్యలు తీసుకోవాల్సిందే

## మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీరువాయి

హైదరాబాద్, సెప్టెంబర్ 7: బీజేపీ ఎమ్మెల్యేల ఆందోళనలతో వాయిదా పడిన తెలంగాణ శాసనసభ తిరిగి మొదలైంది. ఈ సందర్భంగా స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దుర్భాషలాడారని మండిపడ్డారు. తాతా మధు వ్యాఖ్యలపై అందరం మనస్తాపం చెందామని.. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందే అని తెలిపారు. స్పీకర్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత బీజేపీకి లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ చైర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని.. స్పీకర్‌ను దూషించడం దుర్మార్గమని మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించడంపై బీజేపీ వైఖరి చెప్పాలని.. ఆయనకు జరిగిన అవమానంపై ఆ పార్టీ మాట్లాడాలని డిమాండ్ చేశారు.సభ్యులు సభా సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. ఈ అంశంలో బీజేపీ సహకరించాలన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగాన్ని బీజేపీ సభ్యులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గందరగోళం నెలకొంది. సభలో బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. బీజేపీ సభ్యులు సభను అడ్డుకోవడం సరికాదని.. ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

# జిన్నారంలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

### ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

**జిన్నారం, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిన్నారం మున్సిపల్ కేంద్రంలో 'కాంగ్రెస్ బాకీ కార్డుల'ను గడపగడపకు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ జిన్నారం టౌన్ అధ్యక్షుడు గోపగో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. మహిళలకు



రూ. 2,500, రైతు భరోసా, రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, మహిళలకు స్కూటీలు తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు మంద రమేష్, శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, తోట నర్సింగరావు, నీలం మోహన్, బ్రహ్మేందర్ గౌడ్, బిక్షపతి గౌడ్, గోపి గౌడ్, నిఖిల్, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధుపై చర్యలకు రంగం సిద్ధం?

### అనుచిత వ్యాఖ్యలపై మండలి చైర్మన్ నిర్ణయం కోసం ఉత్కంఠ

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసిన వ్యాఖ్యల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తాతా మధు వ్యాఖ్యలకు సంబంధించిన దృశ్యాలను ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చర్యలు తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. సభ నుంచి తాతా మధును బహిష్కరించే అంశంపై



పరిశీలన జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. స్పీకర్ సభకు అధిపతి అని, ఆయన గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందని వారు అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచితంగా మాట్లాడితే క్షమించకూడదని పేర్కొన్నారు. తాతా మధు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తాతా మధును పార్టీ నుంచి బహిష్కరించాలని ఆమె కోరారు. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని ఎంపీ మల్లు రవి కూడా డిమాండ్ చేశారు. అయితే తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని తాతా మధు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారంపై శాసనమండలి చైర్మన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# గిరిజన హక్కులను కాపాడాలి

### గిరిజన వ్యతిరేక విధానాలను విడనాడాలి
### బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, మానుకోటలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి.

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** గిరిజనుల హక్కులను పరిరక్షించాలని, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ గిరిజన సంఘం, ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజనుల భూమి, ఉపాధి, విద్య, వైద్యం తదితర సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి పోడు



సాగుదారులకు హక్కు పత్రాలు అందించాలని కోరారు. గిరిజనులను సాగుభూముల నుంచి తొలగించే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.

బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. మానుకోటలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజనుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించే వరకు తమ పోరాటాలను కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. మహాధర్నాలో రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, భూక్యా వీరభద్రం నాయక్, మాలోత్ కిషన్ నాయక్, మాలోత్ కిషన్ ఈశ్వర్, గోపి నాయక్, శోభన్, నేనావత్ పార్వతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని గంగుల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.




# ఫీజుల బకాయిల చెల్లింపుపై ఛలో ఇందిరా పార్క్

### విద్యార్థి మహాధర్నాకు వెళ్తుండగా బీజేపీ నేత మల్లేష్ గంగ్వార్ అరెస్ట్




**న్యాల్కల్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఛలో ఇందిరా పార్క్ విద్యార్థి మహాధర్నా' కార్యక్రమానికి బయలుదేరిన బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్‌ను పోలీసులు మార్గమధ్యలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను హద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మల్లేష్ గంగ్వార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిల సమస్య విద్యార్థుల విద్యాభవిష్యత్తుతో ముడిపడి ఉందని, ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# బసంతపూర్‌లో వృద్ధురాలు అదృశ్యం.. నాలుగు గంటల్లో ఆచూకీ

**న్యాల్కల్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** బసంతపూర్ గ్రామానికి చెందిన 80 ఏళ్ల ఆమీనాబీ అదృశ్యమైన ఘటనపై హద్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి, నాలుగు గంటల్లోనే ఆమె ఆచూకీని గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం..ఆమీనాబీ సెప్టెంబర్ 4 ఉదయం తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు వడ్డీ గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె మనవడు తాహిర్‌బీ సెప్టెంబర్ 5 మధ్యాహ్నం 12 గంటల సమయంలో హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి, సుమారు నాలుగు గంటల్లోనే ఆమీనాబీ ఆచూకీని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వేగంగా స్పందించి వృద్ధురాలిని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చినట్లు ఎస్ఐ సుజిత్ తెలిపారు.



# రేణికుంటలో హరేరామ హరేకృష్ణ నగర సంకీర్తన

### భగవత్ సేవా సమాజం కోసం ఏకాదశి నగర సంకీర్తన


**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రేణికుంట గ్రామంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మర్కుక్ శ్రీ పాండురంగ ఆశ్రమం ఆధ్వర్యంలో రేణికుంటలోని మహిమాన్వితమైన శ్రీ భవానీ శంకరస్వామి శివాలయం నుండి ఏకాదశి హరే రామ హరే కృష్ణ నామ నగర సంకీర్తన శ్రీ పరాభావ నామ సంవత్సర శ్రావణ మాస కృష్ణ పక్ష ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని సోమవారం ఉదయం 5:30 నుండి రేణికుంట గ్రామం లోని పురవీదుల గుండా హరే రామ హరే కృష్ణ కీర్తన చేస్తు నగర సంకీర్తన నిర్వహించటం జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం ఏకాదశి పురస్కరించుకుని శ్రీ భవానీ శంకరస్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించటం జరిగింది. గ్రామంలోని పురవీదుల గుండా సంకీర్తన నిర్వహించి మరల శివాలయం వద్దకు చేరుకుని తదనంతరం ప్రసాదం నివేదన చేసి మంగళ నీరాజనం సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ చేయటం జరిగింది.

# పటాన్ చెరు క్రైమ్ సబ్ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్ చాకచక్యం..
# 24 గంటల్లో మిస్సింగ్ బంగారం రికవరీ

**ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు..**
**బాధితుడికి ఆభరణాల అప్పగింత**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
పటాన్‌చెరు పరిధిలో మిస్సైన బంగారు ఆభరణాలను పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేసి కేవలం 24 గంటల్లోనే గుర్తించి బాధితుడికి అప్పగించారు. ఫిర్యాదు అందిన వెంటనే క్రైమ్ సబ్ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంబంధిత వ్యక్తుల వివరాలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పరిశీలించి మిస్సైన బంగారు ఆభరణాల ఆచూకీని గుర్తించారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. పోలీసుల వేగవంతమైన స్పందన, సమర్థవంతమైన దర్యాప్తుపై బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా 24 గంటల్లోనే ఆభరణాలను గుర్తించి అప్పగించడంలో చొరవ చూపిన క్రైమ్ ఎస్ఐ ఆసిఫ్‌ను అభినందించారు. ప్రజలు తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. పటాన్‌చెరు పోలీసుల పనితీరుపై వినోద్ కుమార్, బాలు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.



## బాధితులకు సత్వర న్యాయం అందించడమే ప్రజావాణి లక్ష్యం: సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, చట్టపరమైన పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్లో మాట్లాడి కేసుల పురోగతి, ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్య పరిష్కారం కాని పక్షంలో ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి మధ్యవర్తులను నమ్మకుండా, ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని నేరుగా వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సభాపతిని అవమానించేలా వ్యవహరించిన వారిని బర్తరఫ్ చేయాలి

**వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : హైదరాబాద్, ఎనిమిదవ అసెంబ్లీ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. అసెంబ్లీలో జరిగిన ఘటనలు అత్యంత బాధాకరమని అన్నారు. సభాపతిని అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే బర్తరఫ్ చేయాలని సభలో డిమాండ్ చేశారు. పార్టీ నాయకులను ఫామ్‌హౌస్‌కు పిలిపించుకుని దిశానిర్దేశం చేసి అసెంబ్లీకి పంపిస్తున్నారని, అయితే బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం అసెంబ్లీకి హాజరుకాకపోవడం విడ్డురం అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన అసెంబ్లీని, సభాపతి పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సభా మర్యాదలను కించపరిచేలా వ్యవహరించడం తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. "80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్.. తన పార్టీ నాయకులకు నేర్పింది ఇదేనా?" అని బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. ఫామ్‌హౌస్ పాలన వద్దని తెలంగాణ ప్రజలు ప్రజాపాలనను తీసుకొచ్చారని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తుంటే ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు హాజరై ప్రజల సమస్యలపై మాట్లాడాలని అన్నారు. మహిళల పట్ల గౌరవం లేకుండా వ్యవహరించడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. మహిళా పోలీసుల సమక్షంలో మహిళలతో అనుచితంగా వ్యవహరించిన ఘటనలు బాధాకరమని, ఇలాంటి చర్యలను తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. గతంలో మహిళా గవర్నర్‌ను కూడా అవమానించిన ఘటనలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. దళిత బిడ్డను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా చూడలేకనే కేసీఆర్ సభకు రావడం లేదా? అని బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. దళితులు అంటే ఇంత చిన్నచూపా అని నిలదీశారు. దళిత బిడ్డ స్పీకర్ స్థానంలో ఉండటాన్ని గౌరవించాలని, రాజ్యాంగబద్ధమైన పదవులను అవమానించేలా వ్యవహరించడం తగదన్నారు. సభాపతి స్థానంలో ఉన్న వ్యక్తి సభను ధర్మబద్ధంగా నడిపించే ధర్మరాజు లాంటి వారని, అయితే ఈరోజు జరిగిన పరిణామాలతో సభాపతి కన్నీరు పెట్టుకోవడం చూసి తాను తీవ్రంగా బాధపడ్డానని బీర్ల ఐలయ్య అన్నారు. సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని బర్తరఫ్ చేయాలని సభలో కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి జరిగిన ఘటనలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఫామ్‌హౌస్ వద్దకు ప్రజాస్వామ్య పద్ధతిలో డప్పులతో వెళ్లి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.





## బీఆర్ఎస్ నేతలపై పోలీసుల వైఖరికి నిరసనగా ధర్నా

**పటాన్‌చెరులో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సిగ్గుచేటని నాయకులు విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడాన్ని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రజలు జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు.

# చిలుకోడు వైకుంఠధామంలో శివసన్నిధి

**కుటుంబ పెద్దల స్మృతికి చిరస్థాయి గుర్తుగా శివుని విగ్రహం**
**భక్తిశ్రద్ధలతో ప్రారంభోత్సవం.. కొలిపాక కుటుంబ సేవకు గ్రామస్తుల ప్రశంసలు**

**డోర్నకల్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలోని వైకుంఠధామ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివుని విగ్రహాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ రామనబోయిన రాజు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డోర్నకల్ తహసీల్దార్ రాఘవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ప్రారంభించారు. తమ కుటుంబ పెద్దల జ్ఞాపకాలను శాశ్వతంగా నిలుపుకోవడంతో పాటు గ్రామ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఉపయోగపడాలనే ఉద్దేశంతో కొలిపాక కుటుంబ సభ్యులు శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కీర్తిశేషులు కొలిపాక రాములు--లక్ష్మి దంపతుల స్మరణార్థం వారి కుమారుడు కొలిపాక నాగేశ్వరరావు-గంగ దంపతులు, మనుమడు కొలిపాక కిషోర్-నేహ దంపతులు కలిసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రారంభోత్సవం సందర్భంగా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివుని విగ్రహం ఏర్పాటు చేయడంతో వైకుంఠధామ ప్రాంగణానికి మరింత ఆధ్యాత్మిక శోభ చేకూరిందని గ్రామస్తులు తెలిపారుఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కుటుంబ పెద్దల స్మృతిలో శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయమని పేర్కొంటూ కొలిపాక కుటుంబ సభ్యుల సేవా దృక్పథాన్ని అభినందించారు. గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైకుంఠధామంలో శివుని విగ్రహం ఏర్పాటు చేయడం గ్రామానికి ఆధ్యాత్మిక గుర్తింపును తీసుకువస్తుందన్నారు. ఈ ప్రదేశం గ్రామ ప్రజలకు, భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, కొలిపాక కుటుంబ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కుటుంబ స్మృతిని సామాజిక, ఆధ్యాత్మిక సేవగా మలిచిన కొలిపాక కుటుంబాన్ని పలువురు గ్రామస్తులు అభినందించారు.







## కొలనుపాక శ్రీ సోమేశ్వర స్వామి వారి ఆలయంలో బీర్ల ఐలయ్య ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి వారి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి తీర్థప్రసాదాలు అందించి, స్వామివారి ఆశీర్వచనాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాష్ట్ర ప్రజలు, ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని శ్రీ సోమేశ్వర స్వామివారిని ప్రార్థించారు.

# పెండింగ్ పనులను వేగవంతం చేయాలి

**అభివృద్ధి పనులు, పౌర సేవలపై జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ సమీక్ష**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, శేరిలింగంపల్లి:**
శేరిలింగంపల్లి జోన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పౌర సేవలు, రానున్న వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, పారిశుధ్య విభాగాల అధికారులు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగర సుందరీకరణలో భాగంగా మొక్కల పెంపకం, పార్కుల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని జోన్ పరిధిలోని నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువుల వద్ద విద్యుత్ దీపాలు, రహదారి మరమ్మతులు, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పౌర సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులను నారాయణ అమిత్ ఆదేశించారు.



# గణపయ్యను వెతుక్కుంటూ బయటకు వెళ్లొద్దు..డోర్నకల్‌లోనే చూడండి!

**200కు పైగా విభిన్న రూపాల్లో గణనాథుల సిద్ధం.. కమిటీల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు**

**డోర్నకల్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు గణేష్ కమిటీలు సిద్ధమవుతున్న వేళ మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల కేంద్రంలో గణనాథుల విగ్రహాల ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. కమిటీల అభిరుచులకు అనుగుణంగా 200కు పైగా వివిధ రూపాలు, ఆకృతులు, పరిమాణాల్లో వినాయక విగ్రహాలను సిద్ధం చేశారు.ప్రతి మండపానికి ప్రత్యేకత ఉండేలా విగ్రహం రూపం, ఆకృతి, పరిమాణాన్ని కమిటీ సభ్యులు ఎంపిక చేసుకుంటారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ రూపాలతో పాటు వివిధ శైలుల్లో గణనాథులను అందుబాటులో ఉంచడంతో కమిటీలకు విస్తృత ఎంపిక లభిస్తోంది.

**ఒకేచోట విభిన్న నమూనాలు**

విగ్రహాల కోసం ఖమ్మం, మహబూబాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా డోర్నకల్‌లోనే అనేక నమూనాలు అందుబాటులో ఉన్నాయి. మండలంలోని గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే గణేష్ కమిటీలు ఒకే చోట విగ్రహాలను పరిశీలించి తమకు అనువైన వాటిని ఎంపిక చేసుకోవచ్చు. స్థానికంగానే విగ్రహాలు లభించడం వల్ల ప్రయాణ సమయం, రవాణా ఖర్చులు తగ్గే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

**చిన్నవి.. మధ్యస్థవి.. పెద్దవి**

వివిధ పరిమాణాల మండపాలను దృష్టిలో ఉంచుకుని చిన్న, మధ్యస్థ, పెద్ద పరిమాణాల్లో విగ్రహాలను సిద్ధం చేశారు. సంప్రదాయ గణపతి రూపాలతో పాటు భిన్న ఆకృతుల్లోని విగ్రహాలు కూడా అందుబాటులో ఉన్నాయి.విగ్రహాల ఎంపికలో కమిటీలకు ఇబ్బందులు లేకుండా పెద్ద సంఖ్యలో విగ్రహాలను సిద్ధం చేసినట్లు



నిర్వాహకుడు రెడ్డబోయిన సాయి తెలిపారు. కమిటీ సభ్యులు తమ మండపానికి సరిపోయే రూపం, పరిమాణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి ఎంపిక చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సంప్రదించాల్సిన ఫోన్: 9030370330

# గాయత్రి జ్ఞాన మందిరంలో ఘనంగా అన్నాభిషేకం

**శ్రావణ మాసం సందర్భంగా సిద్ధి మహా కాళేశ్వర్ స్వామికి ప్రత్యేక పూజలు**

**స్వర్ణధామా నగర్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సికింద్రాబాద్ పరిధిలోని ఓల్డ్ బోయినపల్లి డివిజన్ స్వర్ణధామా నగర్‌లోని గాయత్రి జ్ఞాన మందిరంలో శ్రావణ మాసం సందర్భంగా సిద్ధి మహా కాళేశ్వర్ స్వామికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.శ్రావణ మాసంలోని సోమవారాల్లో భాగంగా మొదటి సోమవారం లక్ష బిల్వార్చన, రెండో సోమవారం ప్రత్యేక పూజలు, మూడో సోమవారం వివిధ రకాల పండ్లతో ఫలార్చన నిర్వహించారు. చివరి సోమవారం పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం అన్నాభిషేకం చేశారు.వండిన అన్నంతో శివలింగాన్ని పూర్తిగా కప్పి నిర్వహించే ఈ విశిష్ట అభిషేకాన్ని



భక్తులు పరమశివునికి కృతజ్ఞతగా నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పూజ అనంతరం అన్నాన్ని భక్తులకు, పేదలకు ప్రసాదంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ, పూజారులు మాట్లాడుతూ సిద్ధి మహా కాళేశ్వర్ స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యం, శాంతితో జీవించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆలయ పూజారులు రాజేశ్వర్, శైలేంద్రతో పాటు శ్రీవాణి, మధుసూదన్ రెడ్డి, జంజీరాల సురేష్, మహేందర్ యాదవ్, లింగం, సుజిత్ రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# కంటోన్మెంట్ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నేతల వినతిపత్రం

**కంటోన్మెంట్ బోర్డు సీఈఓకి వినతిపత్రం అందచేత**

**సెప్టెంబర్ 07, సికింద్రాబాద్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
బీఆర్ఎస్ అధినేత, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు.

కంటోన్మెంట్ సీఈఓకి వినతిపత్రం

నిరసన కార్యక్రమాలలో భాగంగా కంటోన్మెంట్ కార్యాలయానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు, కంటోన్మెంట్ సీఈఓ అరవింద్ కుమార్ ద్వివేదికి వినతిపత్రం సమర్పించారు.

**కంటోన్మెంట్ ప్రాంత సమస్యలపై చర్చ**


కంటోన్మెంట్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఈఓ దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. ప్రధానంగా రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై బీఆర్ఎస్ నేతలు వివరించారు. కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పోలిస్తే ప్రస్తుత పాలనలో కంటోన్మెంట్ ప్రాంతం అభివృద్ధి విషయంలో వెనుకబడిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోండి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఈఓను కోరారు.కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగానే ఈ వినతిపత్రం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వారు విమర్శించారు.

**ప్రజా సమస్యలపై బి. ఆర్.ఎస్.పార్టీ రాజీ లేని పోరాటం**

ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, కంటోన్మెంట్ ప్రజల కోసం నిరంతరం పోరాడుతామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.కంటోన్మెంట్ ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకులు తెలిపారు.ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని వారు కోరారు.కంటోన్మెంట్ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఈఓకు సమర్పించిన వినతిపత్రంలో బీఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గజ్జల నాగేష్, నివేదిత సాయన్న, కృశాంక్, టీఎన్ శ్రీనివాస్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# వంటగ్యాస్ వినియోగదారులకు ఊరట.. బుకింగ్ గడువు 25 రోజులకు కుదింపు

**గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల పరిమితి తొలగింపు.. దేశవ్యాప్తంగా కొత్త నిబంధనలు అమలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వినియోగదారులకు వర్తిస్తున్న సిలిండర్ పునఃపూరణ బుకింగ్ గడువును 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గించింది. దీంతో పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా గృహ అవసరాల కోసం వంటగ్యాస్ వినియోగించే వారు ప్రతి 25 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించింది.ఈ మేరకు కేంద్ర చమురు, సహజవాయువుల మంత్రిత్వ శాఖ సోమవారం తాజా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కొత్త నిబంధనలను తక్షణమే అమలు చేయాలని చమురు విక్రయ సంస్థలను ఆదేశించింది.

**తాత్కాలిక ఆంక్షల ఎత్తివేత**

ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యప్రాచ్య ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వంటగ్యాస్ సరఫరాపై ప్రభావం పడకుండా, దేశీయ డిమాండ్‌ను నియంత్రించేందుకు కేంద్రం తాత్కాలికంగా బుకింగ్ వ్యవధిని పెంచింది. అప్పట్లో పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని అమలు చేసింది.ప్రస్తుతం వంటగ్యాస్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడంతో పాటు గతంలో పేరుకుపోయిన సరఫరా లోటు కూడా తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 45 రోజుల పరిమితిని తొలగించినట్లు తెలుస్తోంది.

**గ్రామీణ వినియోగదారులకు ప్రయోజనం**




కొత్త నిబంధనలతో గ్రామీణ ప్రాంతాల్లో వంటగ్యాస్ సిలిండర్ కోసం ఎక్కువ రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి తగ్గనుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల వినియోగదారులందరికీ ఒకే విధమైన 25 రోజుల బుకింగ్ వ్యవధి అమల్లోకి రానుంది.




# టేకూర్‌లో ఎస్ఐఆర్ నోటీసులపై ప్రత్యేక శిబిరం

**120 దరఖాస్తుల్లో లోపాల సవరణ..**
**ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు**

**న్యాల్కల్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** న్యాల్కల్ మండలం టేకూర్ గ్రామంలో ఎస్ఐఆర్ నోటీసు ఫారాల్లోని లోపాలను సరిచేసేందుకు సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సంగీత నాగేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో అధికారులు ప్రజలకు అవసరమైన వివరాలను తెలియజేశారు.గత నెలలో గ్రామ ప్రజలు సమర్పించిన ఎస్ఐఆర్ ఫారాల పరిశీలనలో 258 ఫారాల్లో తప్పులు, పొరపాట్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న ప్రజలకు ఫారాల్లోని లోపాలను సరిచేసుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు.శిబిరంలో సుమారు 120 ఫారాల్లోని లోపాలను అధికారులు సరిచేసి, అవసరమైన నోటీసు ఫారాలను ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో జీపీఓలు అశోక్, రాములు, రాజేందర్, బీఎల్వో రజిని తదితరులు పాల్గొని ప్రజలకు సహకరించారు.





# హస్మత్‌పేట్‌లో కొత్త వీధిదీపాలు

**మాజీ కార్పొరేటర్ చొరవతో పలు ప్రాంతాల్లో ఏర్పాటు**

**హస్మత్‌పేట్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** హస్మత్‌పేట్ 264వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలను ఏర్పాటు చేశారు. మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ చొరవతో అంజయ్య నగర్‌లోని సుబ్బారెడ్డి బిల్డింగ్ వెనుక లైన్, మజీద్ గల్లి, మూసవి చౌరస్తా, అబ్రార్ నగర్, అబ్రార్ నగర్ మజీద్ ప్రాంతాల్లో వీధిదీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఇప్పటివరకు వీధిదీపాలు లేక రాత్రివేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికుల సమస్యను గుర్తించిన నర్సింహ యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టారు. దీంతో ఆయా ప్రాంతాల్లో దీపాలు ఏర్పాటు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# పంట కుంట పనులను ప్రారంభించిన సర్పంచ్, ఉప సర్పంచ్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం కుర్రారం గ్రామ పరిధిలోని జలసిరి కార్యక్రమంలో భాగంగా రేకులపల్లి మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పంట కుంట నిర్మాణం పనులను ప్రారంభించిన సర్పంచ్ బొడ్డు భాస్కర్, ఉప సర్పంచ్ రావి కొండల్ రెడ్డి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంపొందించి భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించాలని కోరారు ప్రతి రైతు పంట కుంటలు ఊట కుంటలు నిర్మించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్డు భాస్కర్, ఉప సర్పంచ్ రావి కొండల్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ జింగిటి మధులత, రేకులపల్లి మల్లారెడ్డి, వెంటపర్తి రవీందర్ రెడ్డి, వడ్లూరి జనార్ధన్, గొల్లపల్లి రాధా కూలీలు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ 420 హామీలు అమలు చేయాలని ఎంపీడీవో,ఎమ్మార్వోలకు బీఆర్ఎస్ వినతి

**ఆరు గ్యారంటీలు, 420 హామీలు వెంటనే అమలు చేయాలి**

**బీఆర్ఎస్ రాజపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఎమ్మార్వో, ఎంపీడీవో లకు కాంగ్రెస్ ప్రభుత్వ 420 హామీల అమలుపై రాజపేట మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాజపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన



హామీలను గుర్తు చేసారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. మహిళలకు రూ.2,500, రైతు భరోసా, రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, మహిళలకు స్కూటీలు తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు సట్టు తిరుమలేష్ ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్ర గోకుల జస్వంత్, బెడిదే వీరేశం, బొంగుని ఉప్పలయ్య, ములుగు సోమలింగం, భోగ హరినాథ్, బిల్లకుదురు రాజు, గోపగాని యాదగిరి గౌడ్, ఎండి హబీబ్, చెరుకు కనకయ్య, మరియు తాజా సర్పంచ్ మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు



## ఎస్ఆర్ హాస్పిటల్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** మహబూబాబాద్ పట్టణంలోని హరికిషన్ మిల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ హాస్పిటల్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. హాస్పిటల్ నిర్వాహకుడు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తనయుడు డాక్టర్ సతీష్ రాథోడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన సత్యవతి రాథోడ్ రిబ్బన్ కట్ చేసి హాస్పిటల్‌ను ప్రారంభించారు. అనంతరం హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. మహబూబాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ హాస్పిటల్ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బాణోత్ శంకర్ నాయక్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, గుగులోత్ శ్రీరామ్ నాయక్, బండ బిక్షం రెడ్డి, కౌసల్యాదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ బోడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# హిందూ బాలికపై అత్యాచారం కేసు.. నిందితులు వలీన్,సల్మాన్‌ల అరెస్ట్

**పోలీసుల కాల్పుల్లో గాయాలు..అక్రమ తుపాకులు, తూటాలు స్వాధీనం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ముజఫర్‌నగర్, సెప్టెంబర్ 07:**
ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో 14 ఏళ్ల హిందూ బాలికను అపహరించి అత్యాచారం చేసినట్లు నమోదైన కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రేటా నాగ్లా అటవీ ప్రాంతంలో సెప్టెంబర్ 6న జరిగిన కాల్పుల ఘటన అనంతరం వలీన్, సల్మాన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.లిపోలీసుల కథనం ప్రకారం..లి సెప్టెంబర్ 4న జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఆలయానికి వెళ్తున్న హిందూ బాలికను ముగ్గురు యువకులు అపహరించినట్లు కేసు



నమోదైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్న సమీర్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. వలీన్, సల్మాన్ పరారీలో ఉన్నారు.ఇద్దరు నిందితులు రేటా నాగ్లా అటవీ ప్రాంతంలో ఉన్నారన్న సమాచారంతో పోలీసులు గాలింపు చేపట్టారు. తమను లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించినప్పటికీ వారు కాల్పులు జరిపారని, దీంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో వలీన్, సల్మాన్ గాయపడటంతో వారిని ఆసుపత్రికి తరలించి అనంతరం అరెస్టు చేశారు.నిందితుల వద్ద నుంచి రెండు అక్రమ 315 బోర్ దేశీయ తుపాకులు, రెండు సజీవ తూటాలు, రెండు పేలిన తూటాల అవశేషాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసులో ఉన్న ముగ్గురు నిందితులూ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## తాతా మధును తక్షణమే బర్తరఫ్ చేయాలి

**స్పీకర్‌పై వ్యాఖ్యలు అభ్యంతరకరమన్న డోర్నకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజకుమారి హరినాథ్**

**డోర్నకల్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని డోర్నకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కొండేటి రాజకుమారి హరినాథ్ అన్నారు. రాజ్యాంగబద్ధమైన



పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు.ఎన్నికైన ప్రజాప్రతినిధులు రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. స్పీకర్ పదవిని గౌరవించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధిష్ఠానం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తాతా మధును శాసనమండలి సభ్యత్వం నుంచి తొలగించాలని, ఆయన చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించి స్పీకర్‌కు, ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాజకుమారి హరినాథ్ కోరారు. రాజ్యాంగ పదవుల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు ఎప్పుడు అందిస్తారు?


**కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**

**కొంపల్లి, సెప్టెంబర్ 07(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు హామీలు, 13 ప్రకటనలు, 420 హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు కేపీ వివేకానంద్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో చేపడుతున్న వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆరో రోజు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.కుత్బుల్లాపూర్



నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనతెలిపారు. అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.కొంపల్లి, దూలపల్లి, సుభాష్‌నగర్ విభాగాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉప కమిషనర్ లావణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న కుటుంబాలను గుర్తించి, వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే ప్రజల తరఫున మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు గంగయ్య నాయక్, మాజీ వార్డు సభ్యులు చింతల దేవేందర్, దప్పు కిరణ్, బూర్గుబావి సత్యనారాయణ, గంగయోల వెంకటేష్, మంత్రి రఘు, మహేష్, మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లకు ముఖ్య సమాచారం.. ప్రత్యేక సవరణ గడువు పొడిగింపు




**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 07, తెలంగాణ డెస్క్:** తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గడువును భారత ఎన్నికల సంఘం సవరించింది. ఓటర్ల నమోదు, దావాలు, అభ్యంతరాల స్వీకరణకు సంబంధించిన గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించింది.స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను నవంబర్ 5లోపు పూర్తి చేయనున్నారు. అనంతరం తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9న ప్రకటించనున్నారు.అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది.

# యూకే జాబ్స్ పేరుతో మోసం.. పోలీసుల అదుపులో ప్రముఖ యూట్యూబర్ నందన

**రూ.15 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు.. విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
యూకేలో ఉద్యోగాలు, వీసా పొడిగింపు, ఉద్యోగ సంబంధిత సహాయం, స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ తెలుగు యూట్యూబర్ రమా నందనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై లుకౌట్ నోటీసులు ఉండటంతో శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. యూకేలో నివసిస్తున్న శివక్రాంతి కుమార్ ఫిర్యాదు మేరకు నందన, ఆమె భర్త జాగర్లమూడి మధుకర్, మోహన్‌రావుపై కేసు నమోదైనట్లు సమాచారం.

**రూ.15 లక్షలు బదిలీ చేసినట్లు ఫిర్యాదు**

యూకే వీసా పొడిగింపు, ఉద్యోగం, ధ్రువపత్రాల సహాయం పేరుతో నమ్మించి తమకు సంబంధం ఉన్నట్లు భావిస్తున్న డెస్టినీ కన్సల్టెన్సీ ఖాతాలకు విడతల వారీగా రూ.15 లక్షలు బదిలీ చేయించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం అందించిన పత్రం నకిలీదని గుర్తించినట్లు తెలిపాడు.డబ్బు తిరిగి ఇవ్వాలని కోరిన తరువాత రూ.2 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.13 లక్షలు తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

**మోసం, నకిలీ పత్రాల కేసు**

ఫిర్యాదు ఆధారంగా మధుకర్‌ను మొదటి నిందితుడిగా, రమా నందనను రెండో నిందితురాలిగా, మోహన్‌రావును మూడో నిందితుడిగా చేర్చినట్లు సమాచారం. మోసం, నకిలీ పత్రాల తయారీకి సంబంధించిన నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.విదేశాలకు వెళ్లకుండా నిందితులపై లుకౌట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో నందన విమానాశ్రయంలో పోలీసులకు చిక్కినట్లు అధికారులు తెలిపారు.



**ఆరోపణలను ఖండించిన దంపతులు**

తమపై వ్యక్తిగత కక్షతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని నందన, మధుకర్ దంపతులు గతంలో ఒక వీడియో ద్వారా వెల్లడించినట్లు సమాచారం. తమపై నమోదైన ప్రథమ సమాచార నివేదికను రద్దు చేయాలని కోరుతూ వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది.కేసులో నమోదైన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## ప్రభుత్వ యూత్ ట్రైనింగ్ సెంటర్ లో అవకాశం కల్పించాలని బీర్ల ఐలయ్యకు వినతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** స్టేట్,సెంట్రల్ పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూత్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహణ నిర్ణయం అందరికీ తెలిసిందే దానిలో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి వస్తున్న నోటిఫికేషన్స్, ఎలా చదవాలి, గ్రౌండ్ ప్రాక్టీస్ ఎలా చేస్తే మెరిట్ వస్తుంది అనే అనేక రకాల అంశాలను, సమస్యలను పరిష్కరిస్తూ తమదైన శైలిలో విద్యార్థులకు వాట్సాప్ మాధ్యమం ద్వారా ఉచిత ట్రైనింగ్ ఇస్తూ ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా నిస్వార్ధంగా ప్రభుత్వం చేయలేని అసాధ్యమైన పనిని సుసాధ్యం చేసి దాదాపు 200 మంది వరకు ఉద్యోగాలను సాధించడంలో విశేష కృషి చేశారు. అలాంటి సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ సభ్యులకు ప్రభుత్వం ఏర్పాటు చేసే యూత్ ట్రైనింగ్ సెంటర్ లో ఉద్యోగ అవకాశాన్ని, సైనిక గ్రూప్ ద్వారా ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు ఆ సెంటర్లో చదువుకోవడానికి, సంస్థ సేవలు ప్రభుత్వం గుర్తించి ఇంకొంతమంది దేశానికి సైనికులను తయారు చేయడంలో మాకు సహకరించాలి అని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి సంస్థ తరపున వినతిపత్రం అందజేయడం జరిగింది దానికి వారు మీరు చేస్తున్న ఈ బృహత్కర కార్యానికి మావంతుగా ప్రభుత్వం ద్వారా,స్వతహాగా సహకరిస్తాము అని మీరు కోరినట్టు ట్రైనింగ్ సెంటర్ లో అవకాశాలను కల్పిస్తాం అని హామీ ఇవ్వడం జరిగింది. ఉద్యోగం చేస్తూనే గ్రామీణ ప్రాంతాల్లోని యువతను తనదైన శైలిలో ప్రోత్సహిస్తు ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దే ప్రసాద్ ముదిరాజ్ ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ఫౌండర్ ఉ జనరల్ సెక్రటరీ బండారి ప్రసాద్ ముదిరాజ్, స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## ఒంటరిగా నదిని ప్రక్షాళన చేసిన కుర్రాడు.. నెదర్లాండ్స్ సంస్థ నుంచి జాబ్ ఆఫర్!

### పర్యావరణ ప్రేమికుడు బిట్టు తబాహికి దక్కిన అంతర్జాతీయ గౌరవం



**రాజ్‌గఢ్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ న్యూస్):** అర్జున్ నలవడే కథనం ప్రకారం, పర్యావరణ పరిరక్షణకు ఏ వయసులోనైనా, ఎలాంటి వసతులు లేకపోయినా శ్రీకారం చుట్టవచ్చని నిరూపించాడు మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియాఠ్రాకు చెందిన 21 ఏళ్ల డిగ్రీ విద్యార్థి సురేంద్ర సింగ్ చౌదరి (బిట్టు తబాహి). ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్ళిన నాచుతో నిండిపోయి ప్రాణవాయువు కోల్పోయిన స్థానిక 'అజ్నార్ నది'ని చూసి చలించిన అతడు, 2026 జనవరి 26న తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన పరికరాలతో స్వయంగా నదిని శుభ్రం చేయడానికి శ్రీకారం చుట్టాడు.కనీసం ఈత రాకపోయినా, ఎలాంటి రక్షణ పరికరాలు లేకపోయినా నదిలోకి దిగిన బిట్టుకు ఈ ప్రయాణం తేలికగా ఏమీ సాగలేదు. పని చేస్తున్న సమయంలో విషపూరిత పాములు ఎదురవ్వడం, కలుషిత నీటి వల్ల తీవ్రమైన చర్మ ఇన్ఫెక్షన్లు వచ్చినా అతడు వెనకడుగు వేయలేదు. మొదట్లో కొందరు స్నేహితులు అతడికి సహకరించినా, నదిలోని దుర్గంధాన్ని తట్టుకోలేక వెళ్లిపోవడంతో బిట్టు ఒంటరిగానే పోరాటం కొనసాగించాడు.అనేక నెలల నిరంతర శ్రమ తర్వాత కొద్ది టన్నుల వ్యర్థాలను తొలగించి అజ్నార్ నదిని పూర్వ వైభవానికి తీసుకొచ్చాడు. ఈ ప్రక్షాళనకు సంబంధించిన 'బిఫోర్ – ఆఫ్టర్' వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ పర్యావరణ స్వచ్ఛంద సంస్థ 'ది ఓషన్ క్లీనప్' సీఈఓ బోయన్ స్లాట్ స్పందిస్తూ –(మాతో కలిసి పనిచేయడానికి రండి) అని ఆన్‌లైన్ వేదికగా ఆహ్వానించారు. అంతేకాకుండా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా అతడి కృషిని కొనియాడగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ బిట్టును ప్రత్యేకంగా తన నివాసానికి ఆహ్వానించి అభినందించి ప్రభుత్వ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.



## 'బుక్ మైషో' లో ప్రధాని మోదీ ఈవెంట్ బ్లాక్ బస్టర్..30 నిమిషాల్లోనే సీట్లన్నీ ఫుల్

**వడోదర, సెప్టెంబర్ 07, హైదరాబాద్ పల్స్ న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం గుజరాత్‌లోని వడోదరలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు.మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభకు తొలిసారిగా ముందస్తు నమోదు సౌకర్యాన్ని కల్పించారు. ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం ఇవ్వడంతో ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. నమోదు ప్రారంభమైన అరగంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోయాయి. మరోవైపు 42 వేల మందికి పైగా దరఖాస్తుదారులు నిరీక్షణ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.




దీంతో నమోదు ప్రక్రియను నిలిపివేశారు.సభా ప్రాంగణంలో రద్దీ, తొక్కిసలాటకు అవకాశం లేకుండా ప్రత్యేక ప్రవేశ ఏర్పాట్లు చేస్తున్నారు. నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంకేతంతో కూడిన ప్రవేశ పత్రాన్ని అందించనున్నారు.వడోదర పర్యటనలో భాగంగా రూ.35 వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు మోదీ శ్రీకారం చుట్టనున్నారు. రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన పశ్చిమ ప్రత్యేక సరకు రవాణా మార్గంలోని 326 కిలోమీటర్ల మేర మూడు కీలక విభాగాలను జాతికి అంకితం చేయనున్నారు.అలాగే తాండా రహదారి--వడోదర మధ్య కొత్త ప్రయాణికుల రైలును, చిన్న ఉదయపూర్--ధార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన జోబత్--తాండా రహదారి కొత్త రైల్వే మార్గాన్ని కూడా జాతికి అంకితం చేయనున్నారు.

## హైదరాబాద్‌కు జలగండం.. ఏడాదిలోనే భారీగా పడిపోయిన భూగర్భ జలాలు

### కొన్ని ప్రాంతాల్లో 20 మీటర్లకుపైగా లోతులో నీటిమట్టం

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
హైదరాబాద్‌లో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నగరంలో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి. భూగర్భ జలాల శాఖ గణాంకాల ప్రకారం 2026 ఆగస్టులో నగరంలో సగటు భూగర్భ జలమట్టం 11.20 మీటర్ల లోతులో నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో 6.36 మీటర్లుగా ఉంది.కేవలం ఏడాది వ్యవధిలోనే సగటు నీటిమట్టం దాదాపు ఐదు మీటర్ల మేర లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తర, వాయవ్య, తూర్పు ప్రాంతాలతో పాటు దక్షిణ శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**కుత్బుల్లాపూర్‌లో పరిస్థితి తీవ్రం**

కుత్బుల్లాపూర్‌లో ఆగస్టు నెలలో భూగర్భ జలమట్టం 39.89 మీటర్ల లోతుకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో 14.15 మీటర్లుగా ఉండగా, ఏడాదిలోనే 27.74 మీటర్ల మేర తేడా నమోదైంది.తిరుమలగిరిలో



13.73 మీటర్ల మేర నీటిమట్టం తగ్గి 17.68 మీటర్ల లోతుకు చేరింది. మారేడ్‌పల్లిలోనూ 12.97 మీటర్ల మేర తగ్గుదల నమోదైంది. శేరిలింగంపల్లి, మేడిపల్లి, మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి, హఫీజ్‌పేట్ ప్రాంతాల్లోనూ గణనీయమైన తగ్గుదల కనిపించింది.

**22 శాతం లోటు వర్షపాతం**

ఆగస్టు వరకు హైదరాబాద్‌లో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, ఈసారి 360 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో 22 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది.పర్యవేక్షణలో ఉన్న 46 మండలాల్లో 28 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 17 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, మొయినాబాద్‌లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**సహజ నీటి నిల్వ ప్రాంతాలపై ఒత్తిడి**

వర్షపాతం తగ్గడంతో పాటు కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి పంపే వ్యవస్థలు సరిగా పనిచేయకపోవడం కూడా భూగర్భ జలాల తగ్గుదలకు కారణమవుతోంది. పెరుగుతున్న నిర్మాణాలు, తగ్గుతున్న సహజ నీటి నిల్వ ప్రాంతాలు నీటి పునరుద్ధరణకు అడ్డంకిగా మారుతున్నాయి.మే నెలతో పోలిస్తే ఆగస్టులో నగర సగటు భూగర్భ జలమట్టంలో 0.80 మీటర్ల మేర మెరుగుదల కనిపించినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో నీటిమట్టం ఇంకా 20 మీటర్లకు మించి లోతులోనే ఉంది.వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టడంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర సహజ నీటి నిల్వ ప్రాంతాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## 48 గంటల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీకి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశం

### ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలపై పోలీసుల తీరుపై విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
శాసనసభ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ వచ్చిన ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించింది.సెప్టెంబర్ 7న శాసనసభ సమావేశాల సందర్భంగా తమపై దాడి, అనుచిత ప్రవర్తన, బెదిరింపులు, అవమానించడం, విధులకు ఆటంకం కలిగించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, జె. అనిల్ జాదవ్, విజయుడు, మాణిక్‌రావు కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఘటనపై తీవ్రంగా స్పందించింది. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధుల గౌరవం, భద్రత, చట్టబద్ధమైన హక్కులకు సంబంధించిన అంశం కావడంతో తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు.ఘటనకు సంబంధించిన నిఘా కెమెరాల దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించాలని డీజీపీని ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వ్యక్తులు, అధికారులపై తీసుకున్న చర్యల వివరాలతో కూడిన పూర్తి నివేదికను 48 గంటల్లోగా సమర్పించాలని స్పష్టం చేశారు.విచారణ నివేదిక



అందిన అనంతరం కమిషన్ తన పరిధిలో తదుపరి చర్యలు తీసుకుంటుందని బక్కి వెంకటయ్య తెలిపారు. ఎమ్మెల్యేల ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై వాస్తవాలను నిర్ధారించే దిశగా విచారణ కొనసాగనుంది.

## అసెంబ్లీ సమావేశాలలో ఆలేరును రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలి

### అఖిలపక్ష కమిటీ డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఇట్టి సమావేశాల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ సంబంధించిన అధికార ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజు అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆలేరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా ప్ల కార్డ్స్ తో ప్రదర్శన చేయడం జరిగినది.ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలేరు పేరుకే అసెంబ్లీ ఆలేరు అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడి పోతుందని ఆలేరు అభివృద్ధి జరగాలంటే ఒక రెవిన్యూ డివిజన్ ఏర్పాటు అయితే తప్ప వేరే అవకాశం లేదు దీని దృష్టిలో పెట్టుకొని గత ఐదు సంవత్సరాలు నుండి అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించడం జరిగినది. అలాగే గత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్య మేము అధికారుల్లోకి వస్తే 100 రోజుల్లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తానని మేనిఫెస్టోలో ప్రకటించడం




జరిగింది. అలాగే ఇదే క్రమంలో ఎన్నికల ప్రచార సభలో రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ప్రకటించడం జరిగినది మరియు ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆలేరు రెవిన్యూ డివిజన్ సంబంధించిన అంశాన్ని వాడుకొని ఓట్లు దండుకోవడం జరిగినది. కానీ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై చిత్తశుద్ధి లేదు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అలాగే ఆలేరు గత పాలకులు అసమర్థత వలన పూర్తిగా నిర్వీర్యం అయిపోతున్నది ఆలేరు అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రంలో ఉండాల్సిన ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు వేరే ప్రాంతాలకు తరలిపోవడం వల్ల రేపు జరిగే డిలిమిటేషన్లో ఆలేరు అసెంబ్లీ కూడా కోల్పోయే ప్రమాదం ఉన్నది కావున ఆలేరు రెవిన్యూ డివిజన్ సాధిస్తే ఆలేరు అసెంబ్లీ కాపాడుకున్న వాళ్ళం అవుతాం కావున ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా ఆలేరు ప్రజలకు హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ సంబంధించిన అధికార ప్రకటన విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో మళ్లీ ఉద్యమ కార్యచరణ ప్రకటించి ఉద్యమాలను తీవ్రతరం చేస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పసుపునూరీ వీరేశం, కో కన్వీనర్ రాచకొండ జనార్ధన్, మామిడాల బిక్షపతి, చెక్క వెంకటేష్, మొరిగాడి చంద్రశేఖర్, పుట్ట మల్లేష్, కమిటీకారి అశోక్, కళ్లెపు అడవయ్య, కౌన్సిలర్లు యాట శివ, బీజం మధు, నాయకులు పేరపు రాములు, బేతి రాములు, సీస సత్తయ్య, మాజీ జెడ్పిటిసి బొట్ల పరమేశ్వరి, అంబేద్కర్ యువజన సంఘ సభ్యుడు తుంగ కుమార్, గడ్డం నాగరాజు, ఇక్కిరి శ్రీనివాస్, మామిడాల బాల మల్లేష్, కుర్రి సత్యనారాయణ, ఇరుగదిండ్ల వెంకటేష్, సిపిఐ నాయకుడు కందుల మధు, మైదం భాస్కర్, కుండే సంపత్ తదితరులు పాల్గొన్నారు

# అసెంబ్లీ ఫైట్ కాదు...ఇక 'స్ట్రీట్ ఫైట్': రేవంత్ సవాల్‌కు కేసీఆర్ కొత్త కౌంటర్!

## అసెంబ్లీకి కేసీఆర్ వస్తారా? ప్రజాక్షేత్రంలోకి వెళ్తారా?

### రేవంత్ సవాళ్లకు కేసీఆర్ వ్యూహాత్మక ప్రతివ్యూహం.. సాగునీటి అంశంతో ప్రజల్లోకి వెళ్లే యోచన




**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరో మలుపు తిరుగుతోంది. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న సవాళ్లకు భిన్నంగా కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో అసెంబ్లీ వేదికగా అధికార పక్షాన్ని ఎదుర్కోవడమా.. లేక ప్రజా సమస్యలను ముందుకు తెచ్చి క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమా అన్నదే ఇప్పుడు ప్రధాన రాజకీయ అంశంగా మారింది.

**అసెంబ్లీకి రావాలని రేవంత్ సవాల్**
ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడాన్ని కాంగ్రెస్ రాజకీయ అంశంగా మలచుకునే ప్రయత్నం చేస్తోంది. కేసీఆర్ సభకు వస్తే ప్రభుత్వంతో నేరుగా చర్చించాల్సి ఉంటుందని, రాకపోతే ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఎందుకు సభకు రావడం లేదనే ప్రశ్నను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం కాంగ్రెస్‌కు ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అదే సమయంలో గజ్వేల్‌లో కేసీఆర్, సిరిసిల్లలో కేటీఆర్, సిద్దిపేటలో హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కొంటామని రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలు కూడా బీఆర్ఎస్ అగ్రనాయకత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగానే కనిపిస్తున్నాయి.

**ప్రజా సమస్యలతో కేసీఆర్ ముందుకు**
రేవంత్‌రెడ్డి సవాళ్లకు నేరుగా స్పందించకుండా.. ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నట్లు చర్చ సాగుతోంది. సాగునీరు, రైతుల సమస్యలు, ఉద్యోగాలు, ఫీజు చెల్లింపులు వంటి అంశాలను ముందుకు తెస్తే ప్రభుత్వ పనితీరుపై చర్చ జరిగేలా చేయవచ్చన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. అసెంబ్లీకి ఎందుకు రావడం లేదన్న ప్రశ్న చుట్టూ రాజకీయ చర్చ సాగకుండా.. ప్రభుత్వ వైఫల్యాలపై చర్చను మళ్లించాలన్న ప్రయత్నం ఇందులో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**సాగునీటినే ప్రధాన అంశంగా ఎందుకు?**
తెలంగాణ ఉద్యమ రాజకీయాల్లో సాగునీటి అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇదే అంశాన్ని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా రైతులతో అనుసంధానం పెంచుకోవడంతో పాటు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను రాజకీయంగా ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి వంటి ప్రాజెక్టుల వినియోగం, ప్రస్తుత ప్రభుత్వ వైఖరి వంటి అంశాలపై బీఆర్ఎస్ ఇప్పటికే విమర్శలు చేస్తోంది. సాగునీటిని ప్రధాన అజెండాగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మించగలిగితే పార్టీకి రాజకీయంగా కొత్త ఊపు వస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

**పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహం?**
అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ తరఫున కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు ప్రభుత్వంపై విమర్శలు, పోరాటాలను ముందుకు తీసుకెళు _న్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ స్వయంగా ప్రజాక్షేత్రంలోకి వస్తే పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత చురుకుగా మార్చే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వంపై బయట నుంచి ఒత్తిడి పెంచడం, మరోవైపు పార్టీ శ్రేణులను క్రియాశీలం చేయడం.. రెండు లక్ష్యాలను ఒకేసారి సాధించేందుకు ఈ వ్యూహం ఉపయోగపడవచ్చని అంచనా.

**కేసీఆర్ వ్యూహంలోనూ సవాళ్లు**
అయితే ప్రజాక్షేత్రంలో ఉద్యమం చేపట్టడం వల్ల అసెంబ్లీకి గైర్హాజరుపై వస్తున్న విమర్శలు పూర్తిగా తొలగిపోవడం అంత సులభం కాదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికి శాసనసభకంటే సరైన వేదిక ఏముంటుందని కాంగ్రెస్ ప్రశ్నించే అవకాశం ఉంది. అందువల్ల కేసీఆర్ చేపట్టే ఉద్యమానికి లభించే ప్రజా స్పందనతో పాటు.. అసెంబ్లీకి గైర్హాజరవుతున్నారన్న విమర్శను బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందనేది కూడా కీలకంగా మారనుంది.

ఎజెండా ఎవరి చేతుల్లోకి?
ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో రేవంత్‌రెడ్డి, కేసీఆర్ మధ్య సవాళ్ల పోటీ కంటే.. తమకు అనుకూలమైన రాజకీయ వేదికను ఎంచుకునే పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకువచ్చి ముఖాముఖి రాజకీయ పోరుకు సిద్ధం చేయాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. ప్రజా సమస్యలను ముందుకు తెచ్చి ప్రభుత్వ పనితీరుపై చర్చను కేంద్రీకరించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. సాగునీటి అంశాన్ని కేసీఆర్ రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మలచగలిగితే బీఆర్ఎస్‌కు రాజకీయంగా కొంత ఊతం లభించే అవకాశం ఉంది. అదే సమయంలో కేసీఆర్ అసెంబ్లీ గైర్హాజరీని కాంగ్రెస్ ప్రధాన రాజకీయ ప్రశ్నగా ప్రజల్లో నిలబెట్టగలిగితే అధికార పక్షానికి పైచేయి లభించే అవకాశం ఉంటుంది. అందుకే రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో అసలు పోరు అసెంబ్లీ వేదికపైనా.. ప్రజాక్షేత్రంలోనా.. అన్నదానికంటే, రాజకీయ ఎజెండాను ఎవరు తమ చేతుల్లోకి తీసుకుంటారన్నదే కీలకంగా మారనుంది.




## కనీస వేతన సలహా మండలిలో సీఐటీయూకు ప్రాతినిధ్యం కల్పించాలి

### కార్మిక సంఘాలను పక్కనపెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధం.. నారాయణఖేడ్‌లో సీఐటీయూ నిరసన

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
కనీస వేతన సలహా మండలిలో సీఐటీయూ సహా ప్రధాన కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నారాయణఖేడ్ పట్టణంలోని బాంబే కట్‌పీస్ రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నర్సింలు, డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు, జీవన ప్రమాణాలు, ఉపాధి పరిస్థితులకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే కనీస వేతన సలహా మండలిలో ప్రధాన కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన సలహా మండలి త్రైపాక్షిక వేదికగా ఉండాలని పేర్కొన్నారు. ప్రధాన కార్మిక సంఘాలను పక్కనపెట్టి తమకు అనుకూలమైన సంఘాలతో మండలిని ఏర్పాటు చేయడం వల్ల కార్మికులకు నష్టం కలుగుతుందని, యాజమాన్యాలకు అనుకూలంగా మారే అవకాశం ఉందని విమర్శించారు. కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి కార్మిక సంఘాలకు కనీస వేతన సలహా మండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను పరిష్కరించకపోతే కార్మికులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సింలు, గణపతి, రవి, రామ్‌లాల్, అరుణ్, ఏఐటీయూసీ నాయకుడు సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం మొదలైంది

### అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రభుత్వ పిరికిపంద చర్య

### రచ్చ శ్రీనివాస్ భారతీయ జనతా పార్టీ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా, లక్షలాది మంది పేద విద్యార్థుల చదువులను, భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న రూ.12,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. బకాయిలు అందక కాలేజీలు సర్టిఫికెట్లు నిలిపివేయడంతో 10-12 లక్షల మంది పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారు. వారందరికీ తక్షణమే సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలి.

విద్యా వ్యవస్థ పరిరక్షణ కాలేజీ యాజమాన్యాలకు నిధులు చెల్లించి, సంక్షోభంలో పడ్డ విద్యా వ్యవస్థను కాపాడాలి.

**అక్రమ అరెస్టులపై ఆగ్రహం**
విద్యార్థుల హక్కుల సాధన కోసం రాష్ట్ర బీజేపీ పిలుపునిచ్చిన "అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని నిరంకుశంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే బీజేపీ నేతలను ఇళ్ల వద్ద నిర్బంధించడం, ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రభుత్వ పిరికిపంద చర్యలకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను పోలీసు బలగాలతో నొక్కేయడం సాధ్యం కాదని, ఇలాంటి నిర్బంధాలతో బీజేపీ పోరాటాన్ని ఆపలేరని హెచ్చరించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, బకాయిలు చెల్లించే వరకు బీజేపీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమ అరెస్టులు ఆపి, సమస్య పరిష్కారానికి తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## స్పీకర్ గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు సహించం

### తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి: కో-ఆప్షన్ సభ్యురాలు శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. శాసనసభ వ్యవస్థలో స్పీకర్ కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తారని, అలాంటి పదవిని ఉద్దేశించి బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేయడం ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత దూషణలకు దిగడం సమర్థనీయం కాదన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యల విషయంలో తాతా మధు తన బాధ్యతను గుర్తించాలని సూచించారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడేలా సంబంధిత పార్టీ నాయకత్వం, శాసన మండలి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు తమ మాటలు, ప్రవర్తన ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలకే పరిమితం కావాలని సూచించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించి స్పీకర్‌కు, రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు తమ నాయకులకు బాధ్యతాయుతమైన ప్రవర్తనపై సూచనలు ఇవ్వాలని శీలం భాగ్యలక్ష్మి శ్రీనివాస్ అన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు.. ప్రజా గొంతుకను అణచలేరు

### కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులకు నిరసనగా ఆలేరులో భారీ రాస్తారోకో

### బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా సోమవారం ఆలేరు పట్టణంలో బీఆర్ఎస్ మండల పార్టీ, పట్టణ పార్టీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ లు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో బీఆర్ఎస్ ఉద్యమాన్ని అణచివేయడం ఎవరి తరం కాదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు వంటి ప్రజా నాయకులను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేయడమే" అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార మదంతో వ్యవహరిస్తోందని, ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని



హెచ్చరించారు. "బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తే ఉద్యమం ఆగదు.. ఒక్క నాయకుడిని అదుపులోకి తీసుకుంటే వందల గొంతులు రోడ్డెక్కుతాయన్నారు. ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం మరింత ఉధృతం చేస్తాం" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అణచివేత వైఖరిని విడనాడి, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

హైదరాబాద్ పల్స్